

జగనన్న కాలనీల్లో భారీ అవినీతి



గత వైసీపీ పాలకులు జగనన్న కాలనీ పేరుతో భారీ అవినీతికి పాల్పడ్డారు. ముందుగా పేదలు, రైతుల నుంచి తక్కువ ధరకు భూముల కొనుగోళ్లకు ఒప్పందం చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి రైతుల ఖాతాలకు నగదు జమ అయిన వెంటనే వాటిని వేరే ఖాతాలకు మళ్లించారు. పక్కా ఆధారాలతో ఈ స్కాం వెనుకున్న వారిని శిక్షించ వచ్చు. శ్రీకాళహస్తిలోనూ ఇలా కుంభకోణాలకు పాల్పడ్డారు. టిడ్కో ఇళ్ల పంపిణీ కోసం కచ్చితమైన సమయాన్ని పెట్టుకోవాలి.

- బొజ్జల సుధీర్ రెడ్డి, ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి

దుగరాజపట్నం సముద్ర ముఖద్వారంపై 'మండలి'లో ప్రస్తావన



వాకాడు మండలం దుగరాజపట్నం సముద్రముఖద్వారాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. పులికాట్‌కు సంబంధించి బంగాళాఖాతంలో మూడు ముఖద్వారాలు ఉన్నాయి. వీటిలో వాకాడు మండలానికి సంబంధించి పూడిరాయిదొరవు, తూపిలిపాళెంలో ఉన్నాయి. ముఖద్వారాలు ఇసుకమేటల వల్ల సముద్రంలోకి వేటకు వెళ్లే మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం పూడిరాయిదొరవు వద్ద ముఖద్వారం పూడికతీతకు రూ.97 కోట్లు మంజూరు చేసింది. అలాగే, దుగరాజపట్నం పంచాయతీలోని సముద్ర ముఖద్వార అభివృద్ధికీ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే మత్స్యకార కుటుంబాలకు మేలు జరుగుతుంది.

- బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, ఎమ్మెల్సీ

'గురి' తప్పకూడదు

● ఫైరింగ్‌లో నైపుణ్యం సాధించాలన్న ఎస్పీ



గురిపెడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



ఫైరింగ్ లక్ష్యం సాధించారా.. పరిశీలిస్తున్న ఎస్పీ, అధికారులు

టార్గెట్ 'గురి' తప్పకూడదు. ప్రతి పోలీసు ఫైరింగ్‌లో మంచి సుశిక్షితులు కావాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. చంద్రగిరి మండలం కళ్యాణి డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో అధికారులకు, సివిల్ పోలీస్ సిబ్బంది, ఏ.ఆర్. సిబ్బంది, అధికారులకు ఫైరింగ్ ప్రాక్టీసు నిర్వహించిన వార్షిక ఫైరింగ్ రేంజ్‌లో ఎస్పీ పాల్గొన్నారు. గురిపెట్టి తూటాలు ఎలా పేల్చాలో ఎస్పీ చూపారు. ఫైరింగ్ ప్రాక్టీసులో భాగంగా సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అత్యాధునిక ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీస్ చేసి సిబ్బందిలో ఉత్సాహాన్ని, మనోధైర్యాన్ని నింపారు. శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ దళ పోలీసుల సేవలు చాలా కీలకమన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజల, ప్రభుత్వ ధన, ప్రాణ, రక్షణకోసం ఎల్లవేళలా సంసిద్ధులుగా ఉండాలన్నారు. ఫైరింగ్‌లో పాల్గొని అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఫైరింగ్ రేంజ్‌లో క్రమశిక్షణ అత్యంత ప్రాముఖ్యత వహిస్తుందన్నారు. లక్ష్యంవైపు బుల్ పడేలా తర్ఫీదు పొందాలన్నారు. జిల్లాలో వీఐపీలు, వీవీఐపీల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రముఖులకు భద్రత.. రక్షణ కల్పించాలన్నా కొన్ని నెలలు శిక్షణ అవసరమని, అందులో భాగంగానే వార్షిక ఫైరింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. ట్రైనీ ఎస్పీ హేమంత్, అదనపు ఎస్పీలు రామకృష్ణ, నాగభూషణరావు, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

- తిరుపతి(నేరవిభాగం)/ చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

'పది' పరీక్షలు ప్రారంభం

● తొలిరోజు 299 మంది గైర్హాజరు

- 8లో



తనిఖీ చేసి విద్యార్థులను అనుమతిస్తున్న పోలీసులు, సిబ్బంది

'మండే' సూరీడు

● తొలిసారి నాలుగు మండలాల్లో 40 డిగ్రీలకు చేరిన ఎండ

తిరుపతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలిసారిగా నాలుగు మండలాల్లో వేసవి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరాయి. సోమవారం జిల్లావ్యాప్తంగా మొత్తం తొమ్మిది మండలాల్లో ఎండలు చుర్రుమనిపించగా మూడు మండలాల్లో వడగాడ్పులు వీచాయి. చిన్నగొట్టిగల్లులో అత్యధికంగా 40.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా రేణిగుంటలో 40.2, చంద్రగిరి, వెంకటగిరి మండలాల్లో 40 డిగ్రీల చొప్పున ఎండలు రికార్డయ్యాయి. పిచ్చాటూరులో 39.3, ఎర్రావారిపాలెం, సూళ్ళూరుపేట మండలాల్లో 39.2, బీఎన్ కండ్రిగ, నాయుడుపేటలలో 39 వంతున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రస్తుత వేసవిలో జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరడం ఇదే తొలిసారి. చిన్నగొట్టిగల్లు, నాయుడుపేట, రేణిగుంట మండలాల్లో సోమవారం అధిక ఉష్ణోగ్రతలకు తోడు వడగాడ్పులు వీచాయి.

ఉద్యోగుల నైపుణ్యాలను పెంచే 'ఐ గాట్ కర్మయోగి'

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల నైపుణ్యాలను, సామర్థ్యాలను, సుపరిపాలన పెంపొందించే దిశగా 'ఐ గాట్ కర్మయోగి' పోర్టల్‌లో లాగిన్ అయి సంబంధిత కోర్సులను పూర్తి చేసుకోవాలని డీఆర్వో నరసింహులు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోర్టల్‌లో నమోదు చేసుకున్న ప్రతి ఉద్యోగీ మూడు కోర్సుల్లో టెస్టులు ఉత్తీర్ణులైతే మెరిట్ సర్టిఫికెట్లు, రివార్డులు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో ప్రేమ్‌చంద్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:26 (మంగళవారం సాయంత్రం)
సహర్: 4:59 (బుధవారం ఉదయం)



కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేస్తున్న ఆర్డీ మురళీకృష్ణ

పుత్తూరు మున్సిపాలిటీలో పునర్విచారణ

● పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్ ఆధ్వర్యంలో కమిటీ
● సభ్యులకు దిశా నిర్దేశం చేసిన ఆర్డీ మురళీ కృష్ణ

పుత్తూరు అర్బన్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో 2019-24 మధ్య అవినీతిపై పునర్విచారణకు ఆర్డీ ఆధ్వర్యంలో కమిటీ చేరుకుంది. విచారణ కమిటీ సభ్యులకు సోమవారం ఆర్డీ దిశా నిర్దేశం చేశారు. విచారణ కమిటీలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, ఈఈ సుబ్బరాయుడు, డీఈ పుష్పగిరి నాయక్, ఏఈ విష్ణుతో పాటు మరో క్లర్క్ ఉన్నారు. కమిటీ సభ్యులు విచారణను వేగవంతం చేస్తున్నారు. ముందుగా డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. గతంలో డంపింగ్ యార్డ్ వద్ద చేపట్టిన పనుల్లో అవినీతి జరిగిందని, ఎక్స్‌కవేటర్ అద్దె చెల్లించినట్లుగా బిల్లులు కాజేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఆ దిశగా విచారణ చేపట్టారు. అలాగే 14వ ఆర్థిక సంఘం ద్వారా చేపట్టిన పైప్ పనులను కూడా కమిటీ సభ్యులు పరిశీలించారు. కార్యాలయంలో వివిధ ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌కు ఖర్చు చేసిన నిధులు, ఇతర అంశాలను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు. ప్రస్తుత కమిటీలో పాత వారు ఎవరూ లేరని, అందరూ కొత్త సభ్యులని ఆర్డీ మురళీకృష్ణ వివరణ ఇచ్చారు.

25న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, మార్చి17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 25వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈనెల 30వ తేదీన విశ్వవసు నామ సంవత్సర తెలుగు ఉగాదిని పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆ రోజున శ్రీవారి ఆలయంలో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. అలాగే మార్చి30వ తేదీన ఆదివారం ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని సహస్రదీపాలంకార సేవ మినహా అన్ని ఆర్జితసేవలను రద్దు చేశారు. మార్చి 25తో పాటు 30వ తేదీల్లో ప్రొటోకాల్ పరిధిలోని వీఐపీలకు మాత్రమే వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉంటాయి.ఈక్రమంలో 24, 29వ తేదీల్లో ఎలాంటి సిఫార్సు లేఖలను స్వీకరించబోమని టీటీడీ స్పష్టం చేసింది.



యువగళం పాదయాత్రలో భాగంగా నారాయణవనం మండలానికి వచ్చిన నారా లోకేశ్‌కు చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తున్న తంగెళ్ల సుబ్రహ్మణ్యం (ఫైల్ ఫొటో)



థ్యాంక్యూ బాబూ: నగరిలో చంద్రబాబు చిత్రపటానికి మరమగ్గ, చేనేత కార్మికుల పాలాభిషేకం

'నేతన్న'ల కుటుంబాల్లో వెలుగు

● ఇళ్లకు 200.. మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్తు
● మంత్రి మండలి నిర్ణయంతో వేలాది మందికి లబ్ధి

మగ్గం కదలనుంది. వస్త్రాన్ని నేయనుంది. చేనేత కుటుంబంలో వెలుగులు నింపనుంది. 'నేతన్న'ల ఇళ్లకు 200 యూనిట్ల వరకు.. మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును ప్రభుత్వం అందించనుంది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. దీనివల్ల ఉమ్మడి జిల్లాలోని వేలాది చేనేత కార్మికులకు ప్రయోజనం కలగనుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఉమ్మడి చిత్తూరుజిల్లాలో మదనపల్లె, నగరి, పుత్తూరు ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో మరమగ్గాలు నడుస్తున్నాయి. వెంకటగిరి, నారాయణవనం, మదనపల్లె ప్రాంతాల్లో చేనేత మగ్గాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. మదనపల్లె పట్టణంలో సుమారు 4వేల వరకు మరమగ్గాలు నిర్వహిస్తున్నారు. అలాగే నగరిలో 5వేలు, పుత్తూరులో 2వేలు చొప్పున ఉన్నాయి. ఈ 11వేల మరమగ్గాలకు సంబంధించి ఎక్కువ మంది యజమానులకు ఉచిత విద్యుత్తు రూపంలో ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. అదే విధంగా మదనపల్లెలో 5వేలు, వెంకటగిరిలో 2వేలు, నారాయణవనంలో 1200 చొప్పున ఉమ్మడి చిత్తూరుజిల్లాలో ఎనిమిది వేలకు పైగా చేనేత మగ్గాలు పనిచేస్తున్నాయి. ఈ చేనేత కార్మికుల ఇళ్లకు నెలకు 200 యూనిట్లు వరకు విద్యుత్తు ఉచితంగా సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడం ఆ కుటుంబాలకు ఆర్థికంగా ఊరట కలిగించనుంది. గత ఎన్నికల్లో చేనేత వర్గాలకు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలో భాగంగా ప్రభుత్వం తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది. ఆర్థికంగా ప్రయోజనం కలిగించే ఈ నిర్ణయం పట్ల జిల్లాలోని చేనేత కార్మికుల కుటుంబాలు, మరమగ్గాల యజమానులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయం చేనేత రంగం కోలుకునేందుకు ఎంతగానో ఉపకరిస్తుందని ఆ వర్గాలు సంబరపడుతున్నాయి.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

చేనేతలకు 200యూనిట్లు ఉచిత విద్యుత్ వాగ్దానాన్ని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇది ఆర్థికంగా చితికిన చేనేత కుటుంబాలకు ఎంతో ఊరటనిచ్చే అంశం. చేనేతలలో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వానికి ప్రత్యేక అభినందనలు.

- సుంకర చిన్నరెడ్డిబాబు, జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు

ఉత్పత్తిని పెంచుతాం

ప్రభుత్వం ఇచ్చిన ఉచిత విద్యుత్తుతో మరింత ఉత్పత్తి పెంచుతాం. గతంలో వస్త్రాలు నేయడం కన్నా కూలీ పనులకు వెళ్లవచ్చనే భావన ఉండేది. మాలో చాలా మంది ఇలాగే కూలి పనులకు వెళ్లిపోయారు. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన ఉచిత విద్యుత్‌తో ఉత్పత్తిని పెంచుకుని కుటుంబాన్ని పోషించుకుంటాం.

- చంద్రశేఖర్, ఎగువ పద్మశాలి వీధి, నారాయణవనం

అలిపిరిలో సాధువుల ఆందోళన

బీసీవై నేత రామచంద్రయ్య యాదవ్ మద్దతు - కాలినడకన తిరుమలకు



తిరుమలలో నిరసనలు చేపట్టరాదని చెబుతున్న పోలీసులు

అలిపిరి వద్దకు చేరిన సాధువులు



తిరుపతి, మార్చి17(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం అలిపిరి సమీపంలో ఒబెరాయ్ గ్రూప్‌కు చెందిన 7స్టార్ హోటల్ నిర్మాణాన్ని వ్యతిరేకంగా సాధువులు సోమవారం ఆందోళనకు దిగారు. హోటల్‌కు ఇచ్చిన భూ కేటాయింపులు రద్దుచేయాలని, నిర్మాణాలను కూల్చివేయాలని డిమాండు చేశారు. అలిపిరిలో దీక్ష ప్రారంభించిన వీరు పాదయాత్రగా తిరుమలకు బయలుదేరుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. అలిపిరిలోని యాత్రికుల విశ్రాంత భవనం పక్కన కూర్చోబెట్టారు. ఎక్కువ సంఖ్యలో కాలినడకన వెళ్లడం వల్ల సాధారణ భక్తులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని పోలీసులు నచ్చజెప్పారు. ఇంతలో వీరికి మద్దతుగా బీసీవై పార్టీ నేత రామచంద్ర యాదవ్ తన అనుచరగణంతో అలిపిరి చేరుకున్నారు. వారితో కలసి నినాదాలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. నెయ్యి కల్తీపై ఎవరికి తోచింది వారు చెబుతున్నారని, కల్తీ జరిగిందా? లేదా? అనేదానిపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో గోశాలలు ఏర్పాటుచేసి, వాటినుంచి వచ్చే పాలు, నెయ్యిని మాత్రమే శ్రీవారికి వినియోగించాలని తాను కోరానన్నారు. గోవులతోపాటు 25 ఎకరాల మామిడితోటను గోశాలకు ఉచితంగా ఇస్తానని చెప్పినా వినిపించుకోలేదన్నారు. అలిపిరి వద్ద భూములు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి, ధార్మిక విరుద్ధమైన కార్యక్రమాలు మొదలుపెట్టారో, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తిరుమల పవిత్రత కోసం సాధువులతో కలిసి పాదయాత్రగా కొండకు వెళుతున్నట్టు చెప్పారు. ఇంతలో తిరుమల పోలీసులు శ్రీనివాస సరస్వతితో పాటు రామచంద్రయ్య యాదవ్‌కు నోటీసులు అందజేశారు. తిరుమల కొండపై ఎలాంటి రాజకీయ ప్రసంగాలు, విమర్శలు చేయకూడదని, నిరసనలకు పాల్పడరాదని, ఆధ్యాత్మిక వాతావరణానికి భంగం కలిగించకూడదని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. గోవుకు పూజ చేసి నడకమార్గం ద్వారా తిరుమలకు బయలుదేరారు. 'కొండ'పైకి చేరిన వీరు పోలీసుల నోటీసులను విస్మరించారు. తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా, శ్రీవారి ఆలయం ముందు.. అఖిలాండం వద్దకు నిరసనకు కూర్చున్నారు. నినాదాలు చేశారు. పోలీసులు నచ్చచెప్పినా వినిపించుకోలేదు. చివరకు వీరందరినీ లాగి.. వాహనాల్లో తిరుపతికి, వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. వీరిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టంచేశారు. కాగా, తిరుమలలో ప్రక్షాళన జరిగే వరకు పోరాటం సాగిస్తామని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ చెప్పారు. తిరుమలలో ఈయన్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు భాకరాపేట స్టేషన్‌కు తరలించారు.

ఎర్రచందనం స్మగ్లర్ల వేటకు త్వరలో థర్మల్ ఇమేజింగ్ డ్రోను

టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ వెల్లడి

తిరుపతి, మంగళం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు రాత్రిపూట సైతం స్మగ్లర్లను గుర్తించటానికి వీలుగా థర్మల్ ఇమేజింగ్ డ్రోన్లను రంగంలోకి దింపనున్నారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించింది. టాస్క్‌ఫోర్స్ అధికారులు అన్నమయ్య జిల్లాలో కూంబింగ్ నిర్వహిస్తుంటే అక్కడి నుంచి తప్పించుకున్న స్మగ్లర్లు తిరుపతి జిల్లా వైపు వస్తున్నారు. ఇక్కడ కూంబింగ్ నిర్వహిస్తుంటే అన్నమయ్య జిల్లా వైపు వెళ్లి ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు. దీన్ని నివారించడానికి రాత్రిపూట శేషాచల కొండలపై థర్మల్ ఇమేజింగ్ డ్రోన్లను వినియోగించడానికి ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎర్రచందనాన్ని పరిరక్షించేందుకు, స్మగ్లర్లను అరికట్టడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం శాటిలైట్ ఫోన్లు, జీపీఎస్ సిస్టం, బైనాక్యులర్స్ అందుబాటులో ఉన్నాయని, థర్మల్ ఇమేజింగ్ డ్రోన్లు కూడా వస్తే స్మగ్లర్లను పట్టుకోవడం సులభం అవుతుందన్నారు.

పరీక్షల వేళ నిరంతరాయ విద్యుత్ సరఫరా


అధికారులతో మాట్లాడుతున్న సురేంద్రనాయుడు

పాకాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకొని లోవోల్టేజి సమస్యలు తలెత్తకుండానాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు సూచించారు. సోమవారం ఆయన పాకాల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల సమయంలో, రాత్రి వేళల్లో విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. తాగునీటి పథకాలకు అంతరాయం లేకుండా, రైతులకు 9 గంటల వ్యవసాయానికి మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్సీ,ఎస్టీ వినియోగదారులు పథకంలో రిజిస్ట్రేషన్ చేసుకొని బిల్లులు ఆదా చేసుకోవాలని కోరారు. గృహవినియోగదారులు అదనపు లోడు క్రమబద్ధీకరణ జూన్ నెలాఖరులోపు చేసుకుంటే 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఎస్పీడీసీఎల్ డీఈఈ జీవన్ కుమార్, ఏఈలు హరిప్రసాద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి


తహసీల్దార్‌కి వినతిపత్రం అంజేస్తున్న మునస్వామితదితరులు

పాకాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం పాకాల యూనిట్ నాయకులు డిమాండు కోరారు. సోమవారం తహసీల్దార్ సంతోష్ సాయికి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగ యూనిట్ అధ్యక్షుడు పీఆర్ మునస్వామి మాట్లాడుతూ 2023 జూలై నాటికి ఏర్పాటు చేయాల్సిన కమీషన్‌ను ఇంతవరకు ఏర్పాటు చేయలేదన్నారు. ఐఆర్ ప్రకటించాలన్నారు. డీఆర్, పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలన్నారు. ఈహెచ్ ఎస్ కార్డుపై క్యాష్‌లెస్ వైద్యం పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం కార్యదర్శి ఎం.కుప్పుస్వామినాయుడు, ఉపాధ్యక్షుడు ఆర్.దొరస్వామినాయుడు, మాజీ అధ్యక్షుడు ఎన్.నారాయణ రెడ్డి, సభ్యులు కెఎన్ తులసీరామన్, పి.భాస్కరన్, మునెమ్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాలను సద్వినియోగం చేసుకోవాలి


ఎడంవారిపల్లెలో మినీ గోకులాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో గిడ్డయ్య

భాకరాపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడి రైతుల కోసం ఏర్పాటు చేస్తున్న మినీ గోకులాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గిడ్డయ్య సూచించారు. చిన్నగొట్టిగల్లు మండలం ఎడంవారిపల్లెలో మినీ గోకులాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ, వర్షం వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి పశువులను కాపాడుకోవడానికి ప్రభుత్వం పాడి రైతులకు మినీ గోకులాలను మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, టీడీపీ నాయకులు చంద్రశేఖర్, మోహన్ రెడ్డి, సురేంద్ర, మునిరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోటను సందర్శించిన డిఫెన్స్ కళాశాల బృందం


చంద్రగిరి కోట ఎదుట అధికారుల బృందం

చంద్రగిరి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోటను సోమవారం నేషనల్ డిఫెన్స్ కళాశాల(న్యూఢిల్లీ) బృందం సందర్శించింది. మన దేశానికి చెందిన 12 మంది, రష్యా, శ్రీలంక, ఇండోనేషియా, సౌతాఫ్రికా, నేపాల్ దేశాల నుంచి ఒక్కొక్కరు వంతున బృందంలో ఉన్నారు. మన దేశ బృందంలో ఏపీ మానవ వనరుల శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు,నేషనల్ డిఫెన్స్ మేజర్ జనరల్ సీపీ సంధ్రూ, సివిల్ సర్వీసెస్ అధికారి బాలాజీ ఆధ్వర్యంలో ఇండియన్ నేవీ, ఎయిర్‌ఫోర్స్, సివిల్ సర్వీసెస్, ఇతర అధికారులు ఉన్నారు. ఆర్కియాలజీ అధికారులు వీరికి కోట చరిత్రను వివరించారు. సౌండ్ అండ్ లైట్ ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా టూరిజం అధికారి జనార్దన్‌రెడ్డి, కోట ఆర్కియాలజీ కన్జర్వేటర్ బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో వెంకటరత్నం, బృందం కోఆర్డినేటర్ కార్తీక్ మహేంద్ర, లైటింగ్ షో మేనేజర్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ స్వామి బదిలీ?

ఎర్రావారిపాలెం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎస్ఐ డీవై స్వామి కర్నూలు జిల్లాకు బదిలీ అయినట్లు తెలిసింది. ఈమేరకు ఆదేశాలు పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారిచేసినట్లు సమాచారం. గతేడాది ఆగస్టులో ఈయన అనంతపురం నుంచి ఇక్కడకు వచ్చారు. ఒకటి రెండు రోజుల్లో బదిలీ ఉత్తర్వులు రానున్నట్లు సమాచారం. ఇక్కడికి అనంతపురం జిల్లా నుంచి రానున్నట్లు తెలిసింది.

విద్యుత్ సదస్సులో 18 ఫిర్యాదులు

రామచంద్రాపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మిట్టకండ్రిగ, కమ్మకండ్రిగ గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సోమవారం సదస్సులు నిర్వహించారు. ఇందులో ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు పాల్గొన్నారు.. ప్రజల నుంచి 18 ఫిర్యాదులు అందాయి. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎస్ఈ కోరారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు జనార్దన్ చౌదరి, మహేష్‌నాయుడు, వేణుగోపాల్, ఏడీఈ శంకరయ్య, ఏఈ గిరి, వెంకటమునియాదవ్, కిషోర్,జ్యోతిప్రకాష్, బాలకృష్ణ, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ



చంద్రగిరి, మార్చి 17(ఆంధ్ర జ్యోతి): మల్లయ్యపల్లెలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరును చోరీ చేశారు. గ్రామానికి చెందిన బాధితుడు దివాకర్ తెలిపిన వివరాల మేరకు ఇతని వ్యవసాయ పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. సోమవారం ఇది పడి ఉందని స్థానికులు చెప్పడంతో దివాకర్ వెళ్ళి చూశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి ఉంది. ఇందులో రాగి వైరును చోరీ చేసినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేసవి ప్రారంభమవ్వడంతో మామిడి చెట్లకు నీరు అవసరమని, అధికారులు న్యాయం చేయాలని దివాకర్ కోరారు.

ఘనంగా జ్ఞానపథ వేంకటేశ్వరాలయ తృతీయ వార్షికోత్సవం


పట్టు వస్త్రాలు స్వామి వారికి తీసుకొస్తున్న గుండాల గోపీనాథరెడ్డి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలోని జ్ఞానపథ వేంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేకాలంకరణ, పూజలు నిర్వహించారు. యూనివర్సిటీ అధికారులు, విద్యార్థులు, ఉద్యోగులు స్వామి వారిని దర్శించుకున్నారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

23న ఉగాది కవి సమ్మేళనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23వ తేదీన తిరుపతిలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో సమ్మేళనం ప్రారంభం కానుంది. ఆసక్తి గల కవులు ఇందులో కవితా పఠనం చేయవచ్చు. ఐదుగురు ఉత్తమ కవులను 28వ తేదీన నిర్వహించే ఉగాది వేడుకల్లో సత్కరిస్తారని తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజ తెలిపారు.

సంకటహర చతుర్ధశి వేడుకలు



తిరుపతి (జీవకోన), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వినాయకసాగర్ వద్ద వినాయకస్వామి ఆలయంలో సంకటహర చతుర్థశి సందర్భంగా స్వామివారికి సోమవారం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ పురోహితులు సురేష్‌స్వామి, ఆదిస్వామి, ధర్మకర్త చెంగారెడ్డి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 28 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 17(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 28 మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి, సోమవారం నాలుగవ అదనపు జ్యుడీషియల్ న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.10వేలు చొప్పున రూ.2.80 లక్షలు జరిమానా విధించారు.

30న ఉగాది కవి సమ్మేళనం

శ్రీకాళహస్తి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలంలో విశ్వవసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని 30వ తేదీ పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వామివారి ప్రధాన ఆలయం ఎదుట ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

పకడ్బందీగా పదవ తరగతి పరీక్షల ప్రారంభం


పాకాల పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు


చిన్నగొట్టిగల్లు పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఉపాధ్యాయుడు

చంద్రగిరి/పాకాల/రామచంద్రాపురం/భాకరాపేట/ఎర్రావారిపాలెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):చంద్రగిరి మండలంలో సోమవారం పదవ తరగతి పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారులు లలితకుమారి, భాస్కర్‌బాబులు తెలిపారు. ఏడు కేంద్రాల్లో 1088 మంది పరీక్షలు రాశారు. 12మంది గైర్హాజరయ్యారు. పాకాల మండలం దామలచెరువు, పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. 456 మందికి గాను ఎనిమిది మంది గైర్హాజరయ్యారు. రామచంద్రాపురం మండలంలో నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో మార్కండేయనాయుడు తెలిపారు. కుప్పంబాదూరులో ముగ్గురు, కమ్మకండ్రిగలోని చేకూరి నాగమనాయుడు ఎర్రముల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకరు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించినట్లు ఎస్ఐ రామాంజనేయులు చెప్పారు. చిన్నగొట్టిగల్లులో 78మంది, భాకరాపేటలో 138 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎర్రావారిపాలెం మండలంలో మూడు కేంద్రాల్లో ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు తొలిరోజు 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో వెంకట సుబ్రమణ్యం తెలిపారు.

ఐఐటీని సందర్శించిన డీఎస్‌టీ సెక్రటరీ అభయ్ కరేంధేకర్



ఏర్పేడు, మార్చి17(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు ఐఐటీలోని టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్(టీఐహెచ్)ని సోమవారం భారత ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరేందేకర్ నేతృత్వంలోని సభ్యులు సందర్శించారు. వీరికి డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ, టీఐహెచ్ సీఈవో మేజర్ జనరల్ ఎం.రాజేంద్రన్ అధ్యాపకులు కలసి స్వాగతం పలికారు. టెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, వ్యవసాయ రంగాలలో చేపడుతున్న ఫండింగ్ ప్రాజెక్టులు, అనువాద పరిశోధన, సాంకేతిక అభివృద్ధిలో పురోగతిని టీఐహెచ్ సీఈవో రాజేంద్రన్ ప్రజంటేషన్ చేశారు. ఎన్ఎం-ఐసీపీఎస్ మిషన్ డైరెక్టర్ డాక్టర్ ఏక్తా కపూర్, డీఎస్‌టీ జాయింట్ సెక్రటరీ ధనలక్ష్మి, జీడీపీడీసీ చైర్మన్ శ్రీకాంత్ శాస్త్రి, ఎస్ఐఎఫ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ రోషన్ శ్రీవాస్తవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలను పాటించాలి


బీఐఎస్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీ శుభం బన్సల్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ రిసోర్స్‌పర్సన్ డాక్టర్ జనార్దన్‌తో కలిసి బ్యూరో ఆఫ్ ఇండియన్(బీఐఎస్) స్టాండర్డ్స్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల కోసం కేంద్ర ప్రభుత్వం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. వస్తువులకు ఐఎస్ఐ, ఎలక్ట్రానిక్ వస్తువులకు సీఆర్ఎస్, బంగారు ఆభరణాలకు హాల్‌మార్కు వంటి గుర్తులు గమనించి కొనుగోలు చేయాలని సూచించారు. నాసిరకం గుర్తిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్ డాక్టర్ యూసఫ్, చెంచయ్య పాల్గొన్నారు.

వెదురు సాగుతో లాభార్జన


మాట్లాడుతున్న అధికారులు

తిరుపతి(ఎంఆర్ పల్లె), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వెదురుసాగుతో లాభాలు ఆర్జించవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. తిరుపతిలోని బయోట్రిమ్ ఫారెస్టు రీసర్చ్ సెంటర్‌లో సోమవారం డాక్టర్ జి.కృష్ణారెడ్డి వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో వెదురు సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల రైతులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వెదురుసాగుకు ప్రోత్సాహమిస్తోందన్నారు. వెదురులో రకాలు, ఉప జాతులు, వాటివల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. వెదురుసాగుకు ప్రభుత్వం అందించే రాయితీలపైనా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశ్రాంత అటవీ రేంజ్ ఆఫీసర్ ఎంవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల సమ్మె



తిరుపతిరూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారమూ కొనసాగింది. వర్సిటీ ప్రధాన గేటు ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో విద్యార్థులు బైఠాయించి నిరసన తెలిపారు. ప్లకార్డులను చేతబట్టి నినాదాలు చేశారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించి, న్యాయం చేయాలని కోరారు.

తిరుమలలో ప్రక్షాళన జరిగే వరకు పోరాటం


మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

భాకరాపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ప్రక్షాళన జరిగే వరకు పోరాటం సాగిస్తామని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ చెప్పారు. సోమవారం తిరుమలలో నిరసన తెలుపుతున్న ఈయనను పోలీసులు అదుపులోని తీసుకుని భాకరాపేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. తిరుమలలో ఆగమశాస్త్ర విరుద్ధంగా వ్యవహరించబోనంటూ ఈయన నుంచి సీఐ ఇమ్రాన్ బాషా డిక్లరేషన్ తీసుకున్నారు. అనంతరం రామచంద్ర యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీలో అనేక అవకతవకలు, అపరాచాలు జరిగాయన్నారు. ఈ ప్రభుత్వం ఇప్పటివరకూ సరైన చర్యలు తీసుకోలేదన్నారు. వ్యాపార ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. అలిపిరి పాదాల చెంత భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరినా స్పందించలేదన్నారు. దీంతో శ్రీవారికి విన్నవించాలని తాను స్వామిజీలతో కలిసి తిరుమలకు పాదయాత్ర చేస్తే ఇబ్బందులు పెట్టారన్నారు. తిరుమలలో ప్రక్షాళన జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


జస్టిస్ అమర్నాథ్‌గౌడ్-జస్టిస్ శ్యాంసుందర్-జస్టిస్ వేలుమణి-వీరేంద్ర సచ్‌దేవ

తిరుమల, మార్చి17(ఆంధ్రజ్యోతి): శ్రీవారిని సోమవారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు.దర్శించుకున్నవారిలో త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్నాథ్‌గౌడ్, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ వేలుమణి, జస్టిస్ శ్యాంసుందర్, బీజేపీ ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ ఉన్నారు. వీరికి అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.

శాస్త్రోక్తంగా గంగమ్మఆలయ కుంభాభిషేకం

శ్రీకాళహస్తి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుందేటివారివీధి ఎస్టీ కాలనీలో కొలువై ఉన్న గంగమ్మ ఆలయ కుంభాభిషేకం సోమవారం శాస్త్రోక్తంగా జరి గింది. గత ఏడాది కొందరు ఎక్స్‌కవేటర్‌తో ఆలయాన్ని కూల్చివేశారు. దీంతో ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్, శ్రీకాళహస్తి పురపాలకసంఘ మాజీ ఫ్లోర్ లీడర్ మిద్దెల హరిని కాలనీవాసులు సంప్రదించారు. స్పం దించిన ఆయన రూ.లక్ష విరాళంగా అంద జేయించి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయిం చారు. దీంతో సోమవారం కుంభాభిషేకం జరిగింది.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం


కానిస్టేబుల్ తల్లికి ఆర్థికసాయం అందిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 17(ఆంధ్రజ్యోతి) : తిరుపతి రిజర్వు విభాగంలో పని చేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన కానిస్టేబుల్ అనిల్‌కుమార్ కుటుంబానికి ఎస్పీ హర్షవర్ధనరాజు చేయూత అందించారు. అతని తల్లి సుశీలమ్మకు సోమవారం రూ.50 వేలు చెక్కు అందజేశారు.

అవిలాలలో పారిశుధ్య ఉద్యోగాలకు సంప్రదించండి

తిరుపతిరూరల్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీలో ఖాళీగా ఉన్న క్లాప్‌మిత్ర, పారిశుధ్య కార్మిక ఉద్యోగాల కోసం సంప్రదించాలని కార్యదర్శి టి.శ్రీలేఖ పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్, బ్యాంక్‌బుక్, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోని తీసుకుని నేరుగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రాజకీయ ఎంట్రీపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటా: అవంతి

తిరుమల, మార్చి17(ఆంధ్రజ్యోతి): తన రాజకీయ ప్రవేశంపై మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ స్పందించారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాజకీయ ప్రవేశంపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ 'ఇంకా నాలుగేళ్లు ఉంది కాదా. తప్పకుండా ఆలోచించి త్వరలో మంచి నిర్ణయం తీసుకుంటా' అని బదులిచ్చారు. తిరుమలలో రాజకీయ ప్రసంగాలను నిషేధిస్తూ టీటీడీ చైర్మన్ తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తున్నానన్నారు. తిరుమల పవిత్రతను కాపాడేలా వ్యవహరించాలన్నారు.

వైసీపీ కోసం పనిచేస్తే సస్పెండ్ చేస్తారా?

- రజక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రవి

తిరుపతి (జీవకోన), మార్చి 17(ఆంధ్రజ్యోతి): బీసీ, కాపుల ఆత్మగౌరవాన్ని వైసీపీ దెబ్బతీసిందని వైఎస్సార్ అభిమాని, రజక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొమ్మగుంట రవి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిపనిచేసిన వారికి గుర్తింపు లేదన్నారు. వాస్తవాలు మాట్లాడితే తనను నగర అధ్యక్షుడు సస్పెండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. తాను వైఎస్ఆర్ అభిమానినని నాకు నచ్చినన్ని రోజులు పార్టీలోనే కొనసాగుతానని చెప్పారు. భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన కొడుకు అభినయ్‌రెడ్డిలను తిట్టిన వ్యక్తికి అధ్యక్షుడు పదవి ఇచ్చారన్నారు. 37ఏళ్ల పాటు వైఎస్ఆర్ అభిమానిగా పార్టీ కోసం, నీ (భూమన) కోసం పనిచేశాను. నమ్మినవాడికి మోసం చేయకూడదని మీకు తెలియదా? చెవులున్నా వినలేని, కళ్లున్నా చూడలేని, కాళ్లున్నా నడవలేనిపరిస్థితి చేసి పెట్టారు ఆ ఇంట్లో వారు' అంటూ వ్యాఖ్యలు చేశారు. తనకు జరిగిన అన్యాయంపై జగన్ మోహన్‌రెడ్డి స్పందించకుంటే తాడేపల్లిలోని ఆయన ఇంటి ముందు పెట్రోల్ పోసుకుంటానన్నారు. ఏ మాత్రం బలహీన వర్గాలపై జగన్‌కు ప్రేముంటే తిరుపతి ఎమ్మెల్యే టిక్కెట్టును బొమ్మగుంట రవి అనే తనకు ఇవ్వాలన్నారు. ఎవరికో ఒకరికి ఇచ్చి ఓడిపోయే పరిస్థితి తీసుకురావద్దు అంటూ వేడుకున్నారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్ అభిమానిగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు.

అడుగడుగునా వ్యర్థాలే


ఆర్టీవో కార్యాలయం పక్కవీధిలో - ఎన్‌సీబీఎన్ కాలనీకి వెళ్లే మార్గం, పేరుకుపోయిన వ్యర్థాలు

తిరుపతి అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రదేశాలైన సప్తగిరికాలనీ, మంగళం 2గ్రామ సచివాలయాల పరిధిలో అడుగడుగునా వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. ఆర్టీవో కార్యాలయం పక్కవీధిలో చెత్త నిల్వ డంప్‌యార్డ్‌ను తలపిస్తోంది. నారా చంద్రబాబు నాయుడు కాలనీకి వెళ్లే కూడలి వద్ద చెత్త పేరుకుపోయింది. అక్కడే ఇటీవల రోడ్డు మరమ్మతులు చేపట్టి మట్టిని గుట్టలుగా నిల్వ చేశారు. రెండు నెలలుగా దాన్ని అలాగే వదిలేశారు. ఎన్‌సీబీఎన్ కాలనీ నుంచి వెంకటేశ్వర కాలనీకి వచ్చే పెద్ద రోడ్డు పొడవునా చెత్త నిల్వలు పేరుకుపోయాయి. దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువైందని స్థానికులు వాపోతున్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా సర్పంచులు, సచివాలయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్షయవ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి



క్షయవ్యాధి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 17(ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధి నిర్ధారణ, చికిత్స పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఈనెల 24న ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షయవ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా నివారించవచ్చునన్నారు. జిల్లాలో 14 పంచాయతీలను టీబీ ముక్త్‌గా గుర్తించామని, వాటిలో రెండేళ్లుగా టీబీ కేసులు లేకపోవడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తిరుపతి అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ముగ్గురు అనారోగ్య బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణీ చేశారు. ఎర్రమిట్టకు చెందిన ఆళ్ల రాజ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం రూ.7లక్షలు భార్య సుగుణకు అందజేశారు. లివర్ కేన్సర్‌తో బాధపడుతున్న ఆటోనగర్ వాసి కిరణ్‌కుమార్‌కు రూ.2.05లక్షలు, మరో అనారోగ్య బాధితుడు శ్రావణ్‌కుమార్‌కు రూ.56వేల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు మహేష్ యాదవ్, బాబ్జీ, సాయి, రూపేష్‌రాయల్ పాల్గొన్నారు.

అమర హాస్పిటల్‌లో రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం



రోబోటిక్ ఆపరేషన్ విజయవంతమైన రోగిని చూపుతున్న డాక్టర్ రమాదేవి, వైద్య సిబ్బంది

రేణిగుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడి సమీపంలో ఉన్న అమర హాస్పిటల్‌లో మొట్టమొదటిసారి రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతమైందని ఆ హాస్పిటల్‌లో ఎండీ డాక్టర్ రమాదేవి పేర్కొన్నారు. సోమవారం ఉదయం హాస్పిటల్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంప్రదాయ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు విజయం సాధించినప్పటికి రోబోటిక్స్, స్వయం అభ్యసన కృత్రిమ మేధస్సుతో, ఈ కొత్త సాంకేతిక శస్త్రచికిత్సలు చేయడంలో సర్జన్లను మరింత కచ్చితత్వం వైపు మళ్లిస్తుందన్నారు. రోబోటిక్ మోకాలి కీళ్ల 3డీ రియల్ టైం మోడల్‌ను నిర్మిస్తుందని, ఫలితంగా మరింత శాశ్వత ఫలితాలు లభిస్తాయని అన్నారు. అమర హాస్పిటల్ కార్డియాలజీ విభాగం డాక్టర్లు 65 ఏళ్ల రోగికి ట్రాన్స్ క్యాథటర్ అయోరిటిక్ వాల్వు ఇంప్లిమెంటేషన్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, అనిల్, రాకేష్ పరశురాం, ఆపరేషన్ థియేటర్ మేనేజర్ స్వప్న, కరీం, రాకేష్, ఆకాష్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అష్టబంధన మహాసంప్రోక్షణ

తిరుపతి అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అలిపిరి పాదాల మండపంలోని వేంకటేశ్వరస్వామి, లక్ష్మీనారాయణస్వామి ఆలయాలల్లో సోమవారం ఉదయం అష్టబంధన మహాసంప్రోక్షణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 6-7.30గంటల మధ్య యాగశాలలో వైదిక కార్యక్రమాలు, మహాపూర్ణాహుతి కావించారు. 7.30-8.30గంటల మధ్య కుంభప్రదక్షిణ, 9.45-10.25 గంటల మధ్య వృషభ లగ్నంలో కళావాహనం, అక్షతారోహణం, మహాసంప్రోక్షణ నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, రుత్వికులు పాల్గొన్నారు.

టీబీ ముక్త్ భారత్‌కు రూ.లక్ష విరాళం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్‌కు విశ్రాంత డీఐవో డాక్టర్ రవిరాజు సోమవారం ప్రభుత్వేతర సంస్థ అయిన అడాప్ట్ ఏ గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ ద్వారా రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సొమ్మును కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డీఎంహెచ్‌వో బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తాం



సమస్యలను తెలుసుకుంటున్న ఎస్ఈ పి.సురేంద్రనాయుడు

తిరుపతి(ఆటోనగర్), మార్చి17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తామని తిరుపతి జిల్లా ఎస్ఈ పి.సురేంద్రనాయుడు వెల్లడించారు. రామచంద్రాపురం మండలంలో సోమవారం మిట్టకండ్రిగ, కమ్మకండ్రిగ గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కార సభలు నిర్వహించారు. రైతులు, వినియోగదారుల సమస్యలు తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. డీఈఈ శంకరయ్య, ఏఈ గిరి పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో అభయ్ కరందికర్



అభయ్ కరిందికర్‌కు పుష్ప గుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 17(ఆంధ్రజ్యోతి) : కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరందికర్ మూడు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం జిల్లాకు వచ్చారు. తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు ఆలయం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్ ఆయనకు స్వాగతం పలికారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

తిరుపతి(ఆటోనగర్), మార్చి17(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులకు రక్షణగా ఉన్న ఆప్కాస్‌ను రద్దు చేయాలని నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 19న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ కార్యదర్శి ఎస్.జయచంద్ర కోరారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతమవుతాయని హెచ్చరించారు.

పీజీఆర్ఎస్‌కు 52 వినతులు

తిరుపతి, మార్చి17(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 52 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. ఫోన్ ద్వారా ఆరుగురు సమస్యలు తెలుపగా, 46 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించినట్లు చెప్పారు. ప్రకాశం పార్కును ఉదయం 4.30 గంటలకు తెరవాలని, అన్నారావు కూడలి వద్ద మోటార్ బోరుకు మరమ్మతులు చేయించాలని, మధురానగర్‌లోని తెలుగుగంగ కార్యాలయం వద్ద చెత్తను నిరోధించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలని, నగరంలో నీటి వ్యాపారం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని ఫిర్యాదులు వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ పాల్గొన్నారు.

రుయాలో అధ్వానంగా పారిశుధ్యం

- వార్డుల ముందు మురుగునీటి ప్రవాహం
- దుర్వాసనతో అల్లాడుతున్న రోగులు

తిరుపతి(వైద్యం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఆస్పత్రిలోని ఏక్లాస్ గదులు, ఆపరేషన్ థియేటర్లకు వెళ్లే మార్గంలో ఎఫ్ఎం వార్డు ముందు ఉన్న కాలువలను కొంతకాలంగా శుభ్రం చేయకపోవడంతో అందులో నుంచి వచ్చే మురుగునీరు నీరు నిల్వ చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీనికితోడు ఇటీవల ఇక్కడ క్యాంటీన్ ఏర్పాటు చేయడంతో అందులో నుంచి వచ్చే మురుగునీరు కూడా తోడవుతోంది. అల్ట్రాసౌండ్ స్కానింగ్ పక్కన కూడా ఇదే విధంగా సైడు కాలువలు నిండి తీవ్ర దుర్వాసన వస్తున్నాయి. దీంతో పక్కనే ఉన్న వార్డుల్లోని రోగులు దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది సైతం ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. రుయా అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.



మురుగునీటిలో తేలియాడుతున్న పురుగులు - అల్ట్రాసౌండ్ స్కానింగ్ పక్కన ఇదీ పరిస్థితి



- కాలువల్లో నిల్వ చేరిన మురుగు నీరు

యూడీఎస్ లీకేజీలు రాకుండా చూడండి

- కమిషనర్ ఎన్.మౌర్య

తిరుపతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఎక్కడా భూగర్భ డ్రైనేజీ లీకేజీలు రాకుండా తగు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం నగరపాలక సంస్థ పరిధిలోని 35వ డివిజన్‌లో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, హెల్త్, ఇంజినీరింగ్, ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. అంతర్గత రోడ్ల పనులు సకాలంలో పూర్తికాకపోవడంపై కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో పనులు పూర్తిచేయాలన్నారు. అనంతరం కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తూ నగరంలో భూగర్భ డ్రైనేజీ లీకేజీలను అరికట్టేందుకు తగు ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా శుభ్రం చేయాలన్నారు. పన్నులను సకాలంలో వసూలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, డీసీపీ మహాపాత్ర తదితరులు ఉన్నారు.



35వ డివిజన్లో పర్యటిస్తున్న కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ

పోలీసు శాఖకు రూ.40 లక్షల సీసీ కెమెరాలు



ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిసిన మోహన్‌కుమార్‌రాజు తదితరులు

తిరుపతి (నేర విభాగం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖకు రూ.40 లక్షల విలువైన సీసీ కెమరాలు ఇచ్చేందుకు తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ముందుకొచ్చింది. పోలీసు శాఖకు స్వచ్ఛంద సేవా సంస్థల సహకారం అవసరమని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఇటీవల కోరడంతో స్పందించిన తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొండూరు మోహన్‌కుమార్ ఫ్రీడమ్ ఆయిల్ యాజమాన్యంతో సంప్రదించి, రూ.40 లక్షల విలువైన సీసీ కెమరాలను అందించేందుకు అంగీకరించారు. ఈ క్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల బృందం సోమవారం ఎస్పీని కలిసి ఈ విషయాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి వాసుదేవ, కోశాధికారి అయ్యప్పన్, ఉపాధ్యక్షుడు మలిశెట్టి రవి, బాలాజీ, కిరణ్, సభ్యులు పాల్గొన్నారు.

భారతీయ జీవనశైలిలో వేదాల అనుసరణ

● కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేద రక్షణతోనే లోక రక్షణ సాధ్యమవుతుందని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో సోమవారం దక్షిణాది రాష్ట్రాల వేద సమ్మేళనాన్ని వర్చువల్ ద్వారా ఆయన ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగే కార్యక్రమంలో శంకర విజయేంద్ర సరస్వతి అనుగ్రహ భాషణం చేశారు. భారతీయ జీవన శైలి వేదాలను అనుసరించి ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచీ వేదపరిరక్షణ చర్యలు అవసరమన్నారు. జ్యోతిషం, పురాణాలు, ఇతిహాసాలు, నీతి, యోగ శాస్త్రాలను వేదాలతో అనుసంధానించాలన్నారు. వేద వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి, సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి, ఉజ్జయినిలోని సాందీపని రాష్ట్రీయ వేద విద్యా ప్రతిష్ఠానం కార్యదర్శి విరుపాక్ష జడ్డిపాల్‌లు మాట్లాడుతూ.. వేద పరిరక్షణ అందరి కర్తవ్యమన్నారు. మంచి జీవన విధానాన్ని అనుసరించడం ద్వారా గొప్ప ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రజల్లో ధార్మిక చైతన్యం పెరగాలన్నారు. ప్రతి ఇంట్లో వేద పారాయణం, గో సంరక్షణ చేపట్టాలన్నారు. అమలధారి సింహ సంకలనం చేసిన 'వేద కల్పవృక్ష', 'వేద మహార్ణవ' అనే గ్రంథాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేద వర్సిటీ రిజిస్ట్రార్ భాస్కరుడు, పలు ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.



వేద సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న విరుపాక్ష జడ్డిపాల్, చిత్రంలో వేదవర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి తదితరులు


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.46 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,721

తలనీలాలు సమర్పించినవారు: 27,261



పారని చోరుల పన్నాగం

దొంగను పట్టించిన ఎల్‌హెచ్‌ఎంఎస్ ● పరారీలో మరో నిందితుడు



పట్టుబడిన మహ్మద్ సయ్యద్ ఇబ్రహీం - ఇంట్లో చోరీకి యత్నిస్తున్న లక్ష్మణ్

తిరుచానూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పోలీసుల పథకం ఫలించింది. ఓ దొంగను పట్టించింది. తిరుచానూరు నుంచి నారాయణాద్రి ఆస్పత్రికి వెళ్లే మార్గంలో పీజీ గార్డెన్స్‌లో విశ్రాంత ఉద్యోగి రోశబ్బ ఉంటున్నారు. రెండు రోజుల క్రితం కుటుంబంతో వేరే ఊరికి వెళ్లారు. వెళ్లేముందు ఆయన పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఆ ఇంటికి లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ఏర్పాటు చేశారు. ఈక్రమంలో సోమవారం వేకువజామున ఇద్దరు దొంగలు రోశబ్బ ఇంట్లోకి చొరబడ్డారు. వారు చోరీకి యత్నిస్తుండగా ఎల్‌హెచ్‌ఎంఎస్ పోలీసు కంట్రోల్‌రూమ్‌ను అప్రమత్తం చేసింది. దీంతో కొద్ది నిమిషాల్లోనే సీఐ సునీల్‌కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి, బ్లూకోల్ట్ సిబ్బంది పూర్ణచంద్రరావు, శ్రీనివాసులు ఆ ఇంటికి చేరుకున్నారు. చాకచక్యంగా లోనికి ప్రవేశించారు. ఈలోగా వీరి అలికిడికి ప్రధాన నిందితుడు లక్ష్మణ్ ఇంటి వెనుక నుంచి తప్పించుకున్నాడు. అతనితో వచ్చిన సయ్యద్ ఇబ్రహీం మాత్రం పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతను తమిళనాడులోని కడలూరుకు చెందిన వాడు. లక్ష్మణ్ కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. ఇతనిది తమిళనాడులోని కల్లకుర్తి. కాగా నిందితుల కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో కత్తులు, రాడ్లు ఉన్నట్లు తెలిసింది. ప్రధాన నిందితుడు ఏపీ,తమిళనాడుల్లో పలు చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. ఊళ్లకు వెళ్తున్నప్పుడు ఇంటి యజమానులు సమాచారమిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ అనుసంధానం చేస్తామని పోలీసులు చెప్పారు. తాజాగా సయ్యద్ ఇబ్రహీం ఇలాగే పట్టుబడ్డాడని తెలిపారు.

శేషాచలం జీవ వైవిధ్యానికి నెలవు

బయో డైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, విజయ్‌కుమార్ తదితరులు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవులు జీవ వైవిధ్యానికి నెలవు అని ఏపీ బయో డైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శేషాచలం - జీవ వైవిధ్యం అంశంపై ఎస్వీయూ సెనెట్ హాల్లో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. శేషాచలాన్ని ఓ జీవ నిధిలా అభివర్ణించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజల సహకారం అవసరమన్నారు. తిరుమలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చొద్దన్నారు. చిన్ననాటి నుంచే జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. బోధన, పరిశోధనల్లోనే జీవ వైవిధ్యం పట్ల ప్రత్యేక దృష్టి అవసరమన్నారు. శేషాచలంలో కొన్ని జీవ జాతులు అంతరిస్తున్న విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. నగరాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు అవసరమన్నారు. డీఎఫ్‌ఓ వివేక్ మాట్లాడుతూ రాయలసీమలో నీటి వనరులున్న ఏ ప్రాంతమైనా జీవ వైవిధ్యంతో పాటు ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందిందన్నారు. శేషాచలంలో జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు అటవీ శాఖ తనవంతు పాత్ర పోషిస్తోందన్నారు. ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు యూనివర్సిటీ తనవంతు సహకారం అందిస్తుందని తెలిపారు. తుడా కార్యదర్శి వెంకటనారాయణ, నవీన్‌కుమార్, బాలాజీ శ్రీవత్స, బీవీ రమణ, యూనివర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి మాట్లాడుతూ నిర్మాణాల కోసం తిరుమలలో చెట్లను తొలగించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్స్ హరికృష్ణ పాకనాటి, అక్షర ఫౌండేషన్ అధినేత మద్దినేని హరిబాబు, బోటనీ అధ్యాపకులు డాక్టర్ కామాక్షమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుగుతూనే ఉన్నాం...

సమస్యలకు పరిష్కారం చూపండి

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల వేడుకోలు ● 250 వినతుల రాక

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 'సార్ వారం వారం కలెక్టరేట్‌కు వస్తూనే ఉన్నాం.. అర్జీలు ఇస్తూనే ఉన్నాం.. మా సమస్యలు పరిష్కారం కావడం లేదు' అంటూ పలువురు అర్జీదారులు అధికారుల ఎదుట వాపోయారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలపై వినతులు సమర్పించారు. మొత్తం 250 అర్జీలు అందగా అందులో 165 రెవెన్యూ శాఖకే ఉన్నాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్ అర్జీలు స్వీకరించారు.


విద్యార్థి సంఘం నాయకుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



పింఛను కోసం తిరుగుతూనే ఉన్నా..

నాలుగేళ్ల క్రితం పక్షవాతంతో కాళ్లు చచ్చుబడిపోయాయి. కూలి పనులకు వెళ్లడానికి కూడా సాధ్యపడటం లేదు. కుటుంబ పోషణ కష్టంగా మారింది. మూడేళ్లుగా తిరుగుతూనే ఉన్నాం. కనికరించి పింఛను వచ్చే విధంగా చూడండి.

- కోటయ్య, కాశీపురం, వాకాడు

డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల కోసం డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ సెంటర్ లేకపోవడంతో ప్రైవేటును ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. తద్వారా వారిపై ఆర్థికభారం పడుతోందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు అక్బర్, మల్లికార్జున, చిన్న, ఓంరాజ్, శివశంకర్‌నాయక్, సుందర్ పాల్గొన్నారు.

అంతర్గత పదోన్నతులు కల్పించాలి


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్టు ఉద్యోగులు

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ఫీల్డ్ సిబ్బందికి అంతర్గత పదోన్నతులు కల్పించాలని ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ఫీల్డ్ సిబ్బంది 17 ఏళ్ల సర్వీసును పరిగణనలోకి తీసుకుని వారిని ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఇందులో పనిచేసే ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబానికి రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు ఇవ్వాలని, సర్వీసు వెయిటేజీ కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యమిత్రలు కవిత, సాధికారెడ్డి, చంద్రమ్మ, సారిక, సురేఖ, జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్‌ను నియమించాలి


కలెక్టరేట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు

రాష్ట్రంలోని 13 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు డీఏ బకాయిలు చెల్లించాలని, 2023 నుంచి అమలు చేయాల్సిన 12వ పీఆర్సీ కమిటీని నియమించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద కొంతసేపు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరామనాయుడు, సహాధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ పెండింగ్ గ్రాట్యుటీ చెల్లింపునకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నగర ప్రధాన కార్యదర్శి వెంకటేశం శెట్టి, సభ్యులు అల్లాబక్షు, కృష్ణమూర్తి, శేఖర్, జగన్నాథనాయుడు, జయరాం, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైసీపీ కోఆర్డినేటర్ అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన సతీమణి సుధారెడ్డిపై అసత్య ప్రచారాలు చేశారని నమోదైన కేసులో వైసీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ చరణ్‌తేజను తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు... తిరుపతి రూరల్ పుదిపట్లకు చెందిన వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ చరణ్‌తేజ.. ఎమ్మెల్యే నాని, సుధారెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ తిరుపతి రూరల్‌కు చెందిన చింతకాని సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన కారణంగా సోమవారం చెర్లోపల్లి-చంద్రగిరి రహదారిలోని పెట్రోలు బంకు వద్ద అతన్ని అరెస్టు చేశారు. మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా ఈనెల 28వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

● తొలిరోజు 299 మంది గైర్హాజరు


పరీక్షా కేంద్రం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్ తనిఖీలు



పరీక్షకు ముందు తల్లిదండ్రులతో వీడియో కాల్

హాల్ టిక్కెట్ నెంబర్లను చూసుకుంటూ..


పరీక్షా కేంద్రం వద్ద ఓ తల్లి సెల్ఫీ


తిరుపతి అర్బన్ జీవకోనలోని విశ్వం స్కూల్ వద్ద విద్యార్థులు


తల్లిదండ్రుల ఆశీర్వాదం

తిరుపతి(విద్య), మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 164 కేంద్రాల్లో తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు 299 మంది గైర్హాజరయ్యారు. 26,803కుగాను 26,504 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. తొలిరోజు పరీక్షకు విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కూడా పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు.ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల 7.30 గంటల నుంచే పరీక్ష కేంద్రాలవద్దకు రావడం మొదలుపెట్టారు. మరోవైపు నగరంలోని ఆలయాల వద్ద విద్యార్థులు మొక్కుతూ కనిపించారు. పరీక్ష ప్రారంభమైన తరువాత కూడా కేంద్రాలవద్ద నుంచి విద్యార్థులు తల్లిదండ్రులు వెళ్లకపోవడంతో కొన్ని చోట్ల పోలీసులు బలవంతంగా వారిని అక్కడినుంచి పంపించాల్సి వచ్చింది. పది పరీక్షలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపట్టింది. అన్ని కేంద్రాలవద్ద గట్టి భద్రతా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని నాలుగు సమస్యాత్మక పరీక్ష కేంద్రాలవద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేశాకే కేంద్రాల్లోకి అనుమతించారు. కేంద్రాల సమీపంలో జెరాక్స్ సెంటర్లను, ఇంటర్‌నెట్ సెంటర్లను ముందుగానే మూయించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి తీసుకువెళ్లకుండా జాగ్రత్త వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పది ఫ్లయింగ్ స్క్వాడ్లు కేంద్రాలను తనిఖీ చేశాయి. 30 మంది సిట్టింగ్ స్క్వాడ్లు ఆయా కేంద్రాల్లో ఉన్నాయి. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ లాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు.

ఉమ్మడి జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లకు నిధుల మంజూరు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : 2024-25 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో చేపట్టిన ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలకు సంబంధించిన నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ● ఎస్వీయూ పరిధిలోని 160 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లకు రూ.32.64లక్షలు ● పద్మావతి వర్సిటీకి రూ.3,26,400 ● ద్రవిడ వర్సిటీకి రూ.1,22,400 ● ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి రూ.3,67,200 ● ఎస్వీ వేద విశ్వవిద్యాలయానికి రూ.40,800 ● జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి రూ.61,200 ● శ్రీసిటీ ట్రిపుల్ ఐటీకి రూ.61,200 ● చిత్తూరు అపోలో యూనివర్సిటీకి రూ.40,800 మంజూరయ్యాయి.

'కుప్పం'లో ఉపాధి పనులపై విజి'లెన్స్'

తిరుపతి(నేరవిభాగం), మార్చి 17(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో కుప్పం నియోజకవర్గంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్సు అధికారులు దృష్టి పెట్టారు. ప్రాథమికంగా జిల్లా అధికారుల నుంచి రికార్డులు తెప్పించుకున్నారు. మండలాల వారీగా ఏటా ఎన్ని పనులు మంజూరయ్యాయి? ఎన్ని పూర్తి చేశారు? ఏఏ పనులకు బిల్లులు డ్రా చేశారనే కోణంలో దర్యాప్తు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. శాంతిపురం, గుడుపల్లె, కుప్పం, రామకుప్పం మండలాల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అప్పట్లో అవినీతి అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. వీటిపై కొందరు ఫిర్యాదులు కూడా చేసినట్లు తెలిసింది. ఓ ప్రజాప్రతినిధిపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఇష్టానుసారంగా పనులు చేసి, బిల్లులు డ్రా చేసి స్వాహా చేసినట్లు విమర్శలున్నాయి. వీటిపై విజిలెన్సు అధికారులు.. తొలుత రికార్డులను పరిశీలించనున్నారు. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో వీటిని పరిశీలించనున్నారు. ఇలా సమగ్ర దర్యాప్తునకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

ఫిర్యాదుదారులను స్టేషన్ల చుట్టూ తిప్పితే చర్యలు

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలన్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కుంటి సాకులు చెప్పి ఫిర్యాదుదారులను పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పితే చర్యలు తప్పవని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. ఒకే సమస్యపై పదే, పదే వచ్చే వారిని విచారించి సంబంధిత అధికారులను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్ కోసం ఇద్దరు అదనపు ఎస్పీలు, తొమ్మిది మంది సీఐలు, సిబ్బందిని నియమించామని గుర్తు చేశారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులు ఎక్కడా పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ప్రతి వారం తన దృష్టికి వస్తున్న సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆదేశించారు. సోమవారం పీజీఆర్ఎస్‌కు 92 ఫిర్యాదులు రాగా.. దాదాపు పదింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ట్రైనీ ఎస్పీ హేమంత్, అదనపు ఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కనుపూరు జాతరకు 250 బస్సు సర్వీసులు



సమావేశంలో తహసీల్దారు జయజయరావు, ఉత్సవ కమిటీ సభ్యులు

కోట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు ముత్యాలమ్మ జాతరకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు డిపోల నుంచి నుంచి 250 బస్సు సర్వీసులను నడపనున్నట్లు వాకాడు డిపో మేనేజరు పెంచలయ్య తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ముత్యాలమ్మ జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చిల్లకూరు దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో భక్తులకు రవాణా సౌకర్యంపై సమీక్ష జరిగింది. కోట నుంచి ముత్యాలమ్మ జాతరకు రెండు బస్సు పాయింటులను నిర్ణయించారు. కోట నుంచి జాతరకు వెళ్లే బస్సులు వెంకన్నపాలెం మీదుగా వెళ్లాయి. తిరుగు ప్రయాణంలో వంజవాక మీదుగా కోట క్రాస్‌రోడ్డుకు చేరుతాయి. అదే విధంగా వాకాడు డిపో నుంచి 30 సర్వీసులను కోట, నాయుడుపేట బస్టాండ్ నుంచి నడుపుతామని డీఎం తెలిపారు. అదే విధంగా సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు, నెల్లూరు డిపోల నుంచి మరో 220 బస్సు సర్వీసులను ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు నడిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఉత్సవ కమిటీ వెల్లడించింది. సమావేశంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, చిల్లకూరు దశరథరామి రెడ్డి, నెల్లూరు మోహన్‌రెడ్డి, పెంచలయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమ్మ, ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

కళాశాల స్థలంలో ఆక్రమణలను తొలగించాలి



ఆందోళన చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

నాయుడుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలంలో ఆక్రమణలను తక్షణమే తొలగించాలంటూ సోమవారం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. డిగ్రీ కళాశాల నుంచి శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు వద్ద ఉన్న కళాశాల స్థలం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు వద్ద నిరసన తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ డిగ్రీ కళాశాలకు ప్రభుత్వం సర్వే నెంబరు 172/1, 173/1, 2లో 6.04 ఎకరాల భూమిని కేటాయించగా అందులో కొంత ఆక్రమణకు గురైందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలంలో ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా మరుగుదొడ్ల నిర్మాణం

కోట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు పంచాయతీల్లో మరుగుదొడ్ల నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ మహేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మరుగుదొడ్ల నిర్మాణంపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీలకు 400 మరుగుదొడ్లు మంజూరు కావడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఇంటింటా సర్వే చేసి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ అరవింద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

పెళ్లకూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే వినతుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ యువరాజు తెలిపారు. సోమవారం వచ్చిన వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి, ఈఓపీఆర్డీ ఏఈ మనోజ్, హౌసింగ్ ఏఈ వెంకయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మి, ఉపాధి ఏపీవో దయానందం తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం

దక్కిలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రజా విజ్ఞప్తుల దినం కార్యక్రమంలో అందే అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం వివిధ సమస్యలపై 12 వినతులు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి, ఆర్ఐ ప్రియాంక, మండల సర్వేయర్ రాజగోపాల్, వీఆర్వోలు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారిణికి సత్కారం



దీపికను సత్కరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ

నాయుడుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల తైక్వాండో పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారిణి దీపికను మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ ఉయ్యాల పవన్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సులభతర బోధన అందించాలి

దక్కిలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సులభ తరహాలో పాఠ్యాంశాలను అందించాలని ఎంఈవో జగదీష్ బాబు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఆయన మార్గనుంట ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

26న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

నాయుడుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో ఈనెల 26న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఏపీపీవీ కన్వీనర్ తడుకు చెంచు తెలిపారు. సోమవారం స్థానిక వీబీ రామన్ డిగ్రీ కళాశాలలో కబడ్డీ పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం కైవశం చేసుకున్న జట్టుకు రూ.10వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.6వేలు, తృతీయ స్థానం పొందిన జట్టుకు రూ.4వేలు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9347276012, 7095006390 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఏబీవీపీ నాయకులు మణికంఠ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ హుండీ లెక్కింపు

నాయుడుపేట టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రెండు నెలలకు గాను రూ.2,27,410 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈవో రవికృష్ణ, టీడీపీ నేతలు సుబ్బానాయు, నారాయణ, మల్లాం రవి, గంగాప్రసాద్, వెంకటేశ్వర్లు, మస్తాన్, సుధీర్ పాల్గొన్నారు.



హుండీ నగదు లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

పెళ్లకూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కగారిపేట పొలాల్లో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు... ముమ్మారెడ్డిగుంట గ్రామానికి చెందిన సరళ, చెంగయ్య దంపతుల తిరుపాలనాయులో స్థిరపడ్డారు. వారి కుమారుడు హరీష్(24) ఇటుక రాయి కోత పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ముమ్మారెడ్డిగుంటకు వచ్చిన హరీష్ కొందరితో కలిసి మద్యం తాగాడు. సోమవారం ఉదయం 8 గంటలకు అక్కగారిపేట సమీపంలో పొలాల్లో హరీష్ స్పృహతప్పి పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి 108 వాహనంలో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ రామయ్య ఆస్పత్రి వద్దకు చేరుకొని వివరాలు సేకరించారు.



మృతుడు హరీష్

వెనామికి వైట్‌స్పాట్ వైరస్
లక్షల్లో చనిపోతున్న రొయ్య పిల్లలు

కోట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రొయ్యల సాగుకు మళ్లీ ఒడిదుడుకులు మొదలయ్యాయి. ఈ క్రాప్‌లో అయినా లాభాలు గడించవచ్చన్న రొయ్య రైతులకు చేదు అనుభవం ఎదురవుతోంది. నెల రోజుల నుంచి వాతావరణంలో మార్పుల వల్ల వెనామి రొయ్యలకు వైట్‌స్పాట్ వైరస్ సోకడంతో పిల్లలు కుప్పలు తెప్పలుగా చనిపోతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. సముద్రతీర ప్రాంతాలైన కోట, వాకాడు, చిట్టమూరు మండలాల రైతులు కొన్నిచోట్ల క్రీక్‌వాటర్, కొన్నిచోట్ల ఉప్పునీటితో వెనామి రొయ్యల సాగు చేపట్టారు. గుంటల్లో పిల్లలను వదిలినప్పటి నుంచి ఆరోగ్యకరంగా ఉండటంతో రొయ్యల ఉత్పత్తిపై ఆక్వా రైతులు ఆశాజనకంగా ఉన్నారు. అయితే వాతావరణంలో మార్పులు, శివరాత్రి దాటిన రాత్రి పూట మంచు తగ్గకపోవడంతో గుంటల్లో వెనామి రొయ్య పిల్లలకు వైట్‌స్పాట్ వైరస్ సోకి చనిపోతున్నాయి. ముఖ్యంగా కోట మండలంలో కొత్తపాళెం, ఉత్తమనెల్లూరు, దొరువులక్ష్మ, సిద్ధవరం, పుచ్చలపల్లి, గోవిందపల్లి, కొత్తపట్నం గ్రామాల్లో సాగులో ఉన్న రొయ్యలకు వైట్‌స్పాట్ ప్రబలి చనిపోతున్నాయి. 5 గ్రాముల సైజు నుంచి 40 కౌంట్ వరకు వైరస్ సోకి రొయ్యలు చనిపోతుండగా, 5 గ్రాముల పైబడిన రొయ్యలు మేత తినకుండా క్రమేణా బలహీన పడుతున్నాయి. కొన్ని పిల్లల మొప్పల దగ్గర తెల్లటిమచ్చలు ఏర్పడి మృత్యువాత పడుతున్నాయి. ఎకరం చెరువులో 2 లక్షల నుంచి 3 లక్షల వరకు రొయ్య పిల్లలు పోసి పెంచామని, ఇప్పుడు వైట్‌స్పాట్ వైరస్ సోకి చనిపోతుండటంతో రైతులు విలవిలలాడుతున్నారు.



చనిపోయిన వెనామి రొయ్య పిల్లలు

స్వల్పంగా పెరుగుతున్న ధరలు

గత వారం కౌంట్‌పై 30నుంచి 40 రూపాయలు పడిపోయిన వెనామి రొయ్యల ధరలు ఈ వారం కౌంట్‌పై రూ.10నుంచి 15 వరకు పెరుగుతున్నాయి. ప్రస్తుతం వెనామి రొయ్యపిల్ల వంద కౌంట్ రూ.235, 90 కౌంట్ రూ.245, 80 కౌంట్ రూ.265, 70 కౌంట్ రూ.300, 60 కౌంట్ రూ.330, 50 కౌంట్ రూ.360, 40 కౌంట్ రూ.390, 30 కౌంట్ రూ.470 లెక్కన పలుకుతున్నాయి. మళ్లీ రొయ్యల పెరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుండడంతో ఆక్వా రైతుల్లో ఆశలు మొదలవుతున్నాయి.





వెంకటగిరిలో రూం నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు - సూళ్లూరుపేటలో పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

ప్రశాంతంగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

గూడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల, సీఎస్ఎం, జీఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, సెయింట్ మేరీస్, వివేకానంద, నారాయణ పాఠశాలతో పాటు మండలంలోని చెన్నూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 8 కేంద్రాల్లో 1319 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 10మంది గైర్హాజరు అయినట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ గీతాకుమారి పర్యవేక్షణలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్‌ను అమలు పరిచారు.

చిల్లకూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. చిల్లకూరు, తిక్కవరం, వరగలి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో 501 మంది విద్యార్థులకు గాను 494 మంది పరీక్షలకు హాజరయ్యారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని ఆరు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 1179 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1164 మంది హాజరయ్యారని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

దక్కిలి: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రాల్లో 190 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 187 మంది హాజరైనట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని రెండు గురుకులాలు, జడ్పీ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, నారాయణ, హోలిక్రాస్ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు జరిగాయి. మొత్తం 1,118 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1,098 మంది హాజరయ్యారు. అన్ని కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు 144 సెక్షన్ విధించారు.

తడ: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. 286మంది విద్యార్థులకు గాను నలుగురు గైర్హాజరయ్యారు. వాటంబేడు ఉన్నత పాఠశాలకు చెందిన 35 మందిని సూళ్లూరుపేట పరీక్షా కేంద్రానికి కేటాయించారు.

పెళ్లకూరు: మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 203మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఎంఈవో మించల శంకరయ్య తెలిపారు.

చిట్టమూరు: మండలంలో మూడు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయని ఎంఈవో కృష్ణయ్య తెలిపారు.

నాయుడుపేట: పట్టణంలోని ఆరు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. 1384మంది విద్యార్థులకు గాను 1364మంది పరీక్షలు రాశారు. 20మంది గైర్హాజరైనట్లు ఎంఈవో మునిరత్నం తెలిపారు.

ఓజిలి: మండలంలోని ఓజిలి, చిల్లమానుచేను పరీక్షా కేంద్రాల్లో 236 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరయ్యారు.

దొరవారిసత్రం: మండలంలోని ఏకొల్లు జడ్పీ, బీసీ గురుకుల పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. బీసీ గురుకులంలో 203 మంది, ఏకొల్లు జడ్పీ హైస్కూల్‌లో 150 పరీక్ష రాశారు.

కోట: మండలంలోని ఆరు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం య్యాయి. మొత్తం 971మంది విద్యార్థులకు గాను 966 మంది పరీక్ష రాశారు.

చిట్టమూరు: మండలంలో మూడు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయని ఎంఈవో కృష్ణయ్య తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూళ్లూరుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం పరిధిలోని కోటపోలూరు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 6నుంచి 9గంటల వరకు కోటపోలూరు, ఆబాక, సామంతమల్లాం, సర్వారెడ్డికండ్రిగ, మినుములమాడి, వందనమూడి తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ పూర్ణిమ తెలియచేశారు.

20న ద్విచక్ర వాహనం వేలం

వాకాడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వాకాడు సర్కిల్ పరిధిలో ఒక కేసులో పట్టుబడిన ద్విచక్ర వాహనాన్ని ఈనెల 20వ తేదీన వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు.

పరీక్షా కేంద్రం వద్ద మురుగు
దుర్గంధంతో విద్యార్థుల ఇక్కట్లు



పాఠశాల గేటు పక్కన నిల్వ చేరిన మురుగునీరు

సూళ్లూరుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వద్ద పరీక్షా కేంద్రం గేటు వద్ద మురుగునిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతోంది. పట్టణ నడిబొడ్డులో జీఎన్‌టీ రోడ్డు పక్కన జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఉంది. రోడ్డు పక్కన కాలువలో మురుగునీరంతా పాఠశాల ప్రవేశ ద్వారం వద్దకు వచ్చి ఆగిపోతోంది. సోమవారం పదో తరగతి రాయడానికి వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గేటు ముందు నిలుచోవడానికి దుర్వాసనతో ఇబ్బందులు పడ్డారు. మున్సిపాలిటీ అధికారులు స్పందించి కాలువలో మురుగునీరు నిల్వ చేరకుండా తొలగించాల్సిన అవసరం ఉంది.

ఎమ్మెల్యే చొరవతో
బస్సు సర్వీసులు పునఃప్రారంభం

వాకాడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వాకాడు ఆర్టీసీ డిపో పరిధిలో కొంత కాలంగా ఆపేసిన బస్సు సర్వీసులను గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చొరవతో పునఃప్రారంభించారు. సోమవారం ఎన్ఎంయూఏ నాయకులు పాశం సునీల్‌కుమార్‌ను కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూఏ నాయకులు మాట్లాడుతూ టీడీపీ పేరుతో వాకాడు డిపో పరిధిలో 8 ఎక్స్‌ప్రెస్ సర్వీసులను గత కొంతకాలంగా నిలుపుదల చేయడంతో నష్టాల బాట పట్టిందన్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి సోమవారం నుంచి అన్ని బస్సు సర్వీసులను పునఃప్రారంభించారన్నారు.

భూములపై హక్కులు కల్పించండి

గూడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలోని అంకులపాటూరు, తిక్కవరం, ఉడతావారిపాలెం గ్రామాల ప్రజలు గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీలమైన తాము అంకులపాటూరు గ్రామ పరిధిలో సుమారు 40 ఎకరాల భూమిని 20 ఏళ్లకు పైగా సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఈ భూమలను ఖాళీ చేయాలని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ భూములపై తమకు హక్కులను కల్పించాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్సీ బీదకు ఎమ్మెల్యేల అభినందన



రిటర్నింగ్ అధికారిణి వనితారాణి నుంచి ఎమ్మెల్సీగా ధృవీకరణ పత్రం అందుకుంటున్న రవిచంద్ర, పక్కన ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

గూడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శాసనసభ్యుల కోటాలో శాసన మండలి సభ్యుడిగా ఎన్నికైన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సోమవారం అమరావతిలో ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి వనితారాణి నుంచి డిక్లరేషన్ ఫాం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు పాశం సునీల్ కుమార్, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు బీద రవిచంద్రకు అభినందనలు తెలిపారు.

మూడంతస్తుల భవనం నుంచి పడి
మహిళకు తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మూడంతస్తుల భవనం నుంచి పడిపోయిన మహిళకు తీవ్రగాయాలైన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల కథనం మేరకు.. పుత్తూరు ప్రాంతానికి చెందిన విజయలక్ష్మి భర్తతో కలిసి నాయుడుపేట పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో నివాసం ఉంటోంది. సోమవారం బట్టలు ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు మూడవ అంతస్తు నుంచి కింద పడిపోయింది. తీవ్ర గాయాలపాలైన విజయలక్ష్మిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం తిరుపతికి తీసుకెళ్లారు.

పంటకాలువ పరిశీలన

నాయుడుపేట టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినది వద్ద ప్రారంభమయ్యే విన్నమాల పంటకాలువను సోమవారం మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా పరిశీలించారు. కాలువలో పూడికతీసి పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకుంటామన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

చిల్లకూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓడూరు, నెలబల్లిరెడ్డిపల్లి గ్రామాల్లో సోమవారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండాల లీలావతి, డాక్టర్ షాలోమ్ ఆరావత్, చిట్టేటి శ్రీనివాసులు, రవికుమార్, మునిలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అళఘునాథస్వామి గ్రామోత్సవం

గూడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అళఘునాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని సూర్యప్రభ వాహనంపై అలంకరించి భక్తుల గోవింద నామస్మరణల నడుమ గ్రామోత్సవం జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సూర్యప్రభ వాహనంపై అళఘునాథస్వామి

అమర హాస్పిటల్‌లో
రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం



రోబోటిక్ ఆపరేషన్ ద్వారా విజయవంతమైన రోగిని చూపుతున్న డాక్టర్ రమాదేవి, వైద్య సిబ్బంది

రేణిగుంట, మార్చి 17, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడి సమీపంలో ఉన్న అమర హాస్పిటల్‌లో మొట్టమొదటి సారి రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతమైందని ఎండీ డాక్టర్ రమాదేవి పేర్కొన్నారు. సోమవారం ఉదయం హాస్పిటల్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... సంప్రదాయ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతం సాధించినప్పటికీ రోబోటిక్స్, నయం అవ్వక కృత్రిమ మేధస్సుతో, ఈ కొత్త సాంకేతిక శస్త్రచికిత్సలు చేయడంలో సరికొత్తను మరింత కచ్చితత్వం వైపు మళ్లిస్తుందన్నారు. రోబోటిక్ టెక్నాలజీ సర్జన్‌కు ప్రత్యామ్నాయం కాదు కానీ తక్కువ మానవ తప్పిదం, సహజ కదిలిక రోగి పరిస్థితులను తట్టుకోవడంతో శస్త్ర చికిత్స ప్రక్రియను పెంచుతుందన్నారు. ఈ రోబోటిక్ మోకాలి కీళ్ల 3డీ రియల్ టైం మోడల్‌ను నిర్మిస్తుందన్నారు. ఫలితంగా మరింత శాశ్వత ఫలితాలు లభిస్తాయని అన్నారు. అలాగే అమర హాస్పిటల్ కార్డియాలజీ విభాగం డాక్టర్లు 65 ఏళ్ల రోగికి ట్రాన్స్ క్యాథటర్ అయోర్టిక్ వాల్వు ఇంప్లిమెంటేషన్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, అనిల్, రాకేష్ వరకూరా, ఆపరేషన్ థియేటర్ మేనేజర్ స్వప్న, కేశం, రాకేష్, ఆకాష్, ఓటీ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె వెలుగు బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

రేణిగుంట, మార్చి 17, (ఆంధ్రజ్యోతి): పల్లె వెలుగు బస్సు ఢీకొని ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఎస్టీబీల్ కూడలి వద్ద జరిగింది. స్థానికుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వెళ్తున్న పల్లె వెలుగు బస్సు ఎస్టీబీల్ కూడలి వద్ద వెళ్తుండగా రోడ్డుపై వాగూరు వెళ్తున్న వ్యక్తి కాలుపై టైరు వెళ్లడంతో నుజ్జునుజ్జు అయింది. దీంతో బంధువులు ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

తప్పిపోయిన మహిళ
కుటుంబ సభ్యులకు అప్పగింత



రేణిగుంట, మార్చి 17, (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన మహిళను గాజులమండ్యం పోలీసులు కుటుంబ సభ్యులకు సోమవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కల్లూరు బీసీ కాలనీ చెందిన బీబీజాను మతిస్థిమితం లేకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. సంబేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆశ్రయ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సభ్యులు ఆమెను చేరదీసి వివరాలు సేకరించారు. అనంతరం బీబీజాను భర్త కలిసావలికి సమాచారం అందించారు. ఈక్రమంలో మహిళను గాజులమండ్యం పోలీసులకు అప్పగించారు. వారు కుటుంబీకుల చెంతకు చేర్చారు.

హసీనాజానుకు రంగస్థల మహిళా రత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న హసీనా జాను

రేణిగుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక, జానపద, పౌరాణిక నాటక కళాకారిణి ద్విచక్ర గిరి హసీనా జాన్‌కు రంగస్థల మహిళా రత్న పురస్కారాన్ని అందుకున్నారు. సోమవారం సికింద్రాబాద్‌లో సీనీ రామన్ అకాడమీ (సేవా సాంస్కృతిక సంస్థ), రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం సంయుక్తంగా హరిహర కళా భవన్‌లో 33వ ఉగాది మహోత్సవ సువర్ణ మంటా కంకణ సంబరాలు నిర్వహించాయి. పురస్కారాన్ని అందుకున్న హసీనా జాన్‌ను తిరుపతి, రేణిగుంట, వెంకటగిరి ప్రాంతాలకు చెందిన కళాకారులు, కూచిమానులు, కళాపోషకులు అభినందించారు.

కారు బోల్తా: నలుగురికి గాయాలు



గూడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురిటిపాళెం సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం ఓ కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు వివరాలు... హైదరాబాద్ లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న జ్యోతి, మహేష్, చైతన్య, అనూష తిరుమలకు కారులో బయలుదేరారు. పురిటిపాళెం జాతీయ రహదారి సమీపంలో వెళ్తుండగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలు కావడంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నకిలీ పట్టాలను రద్దు చేయండి



కేవీబీపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళితులు

కేవీబీపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులకండ్రిగ రెవెన్యూలో సర్వే నెం.254లో దళితుల అనుభవంలో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని సోమవారం బీఎస్పీ నాయకుడు పరశురామ్, సీపీఎం జిల్లా నాయకుడు దాసరి జనార్దన్ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళితుల సాగులో ఉన్న భూములకు నకిలీ పట్టాలు చేసుకున్నారని వాటిని రద్దు చేయాలని తహసీల్దారుకు మునిరత్నంరెడ్డికి అందజేశారు. శ్రీకాళహస్తి ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పి.బాబు, దాము, పురుషోత్తం, సర్పంచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలని...

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కంబాకం దళితుల అధీనంలో ఉన్న సాగు భూములకు పట్టాలివ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రమణయ్య మాట్లాడుతూ... కుక్కంబాకం రెవెన్యూ సర్వే నెం.81లో 80 ఎకరాలను స్థానికేతురులు బినామీ పట్టాలు సృష్టించి దళితులపై కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. అనంతరం తహసీల్దార్ సుబ్రమణ్యంకు వినతిపత్రం అందజేశారు. ఏరియా కార్యదర్శి గంధం మణి పాల్గొన్నారు.

ఇంటి పట్టాల కోసం అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శనలో కనమనంబేడు దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులు ఇంటి పట్టాలు కోసం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలో భాగంగా సోమవారం అర్ధనగ్నంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్, మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య మాట్లాడుతూ ఐదు రోజులుగా ఇంటి స్థలాలు కోసం తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళితులు దీక్షలు చేస్తున్న తహసీల్దార్‌గాని జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇంటి స్థలాలు ఇచ్చే వరకు దీక్షలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

పీహెచ్‌సీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

శ్రీకాళహస్తి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే సుధీర్ కృషి చేస్తున్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. పట్టణంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆదేశాలతో పట్టణంలోని మూడు ఆరోగ్యకేంద్రాలకు రూ.10వేలు చొప్పున రూ.30వేలు ఆర్థిక సాయాన్ని ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ సెంటర్ల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

బాధితులకు భరోసాగా సీఎంఆర్ఎఫ్

● 9 మందికి రూ.12.38 లక్షల చెక్కుల అందజేత



బాధితులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకునే స్థోమత లేని పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. సోమవారం బాధితులకు చెక్కులను అందజేశారు. పుత్తూరుకు చెందిన శ్రీదేవికి రూ.5 లక్షలు, వాసుకు రూ.50 వేలు, అబ్రహాం లింకన్ కుటుంబానికి రూ.45 వేలు, పద్మావతి రూ.1.62 లక్షలు, పుత్తూరు మండలానికి చెందిన బాలాజీకి రూ.35 వేలు, చిన్నపాపకు రూ.1.79 లక్షలు, నగరి మున్సిపాలిటీకి చెందిన సుధా, జీవ, మునికేశవులకు చెక్కులు అందజేశారు. మాజీ ఎంపీపీ అమ్ములు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, కార్యదర్శి ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ రోగుల కోసం రూ. లక్ష విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

పుత్తూరు అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): టీబీ రోగుల కోసం అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ రూ.లక్ష విరాళంగా అందజేసింది. సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫౌండేషన్ రాయలసీమ ఇన్‌చార్జి డాక్టర్ రవిరాజు అందజేశారు. ఈనెల 24న అంతర్జాతీయ టీబీ నిర్మూలన దినం సందర్భంగా బాధితులకు పౌష్టికాహారం అందించనున్నారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ పథకానికి ఈ నిధులు చేరనున్నాయి గత రెండు సంవత్సరాలుగా టీబీ వ్యాధిగ్రస్తుల సహాయార్థం ఫౌండేషన్ తరఫున నిధుల అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఎంహెచ్‌వో బాలాజీ నాయక్, జిల్లా టీబీ అధికారి నారాయణ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం సభ్యత్వ కార్డుల పంపిణీ



పంచాయతీ పార్టీ లీడర్లకు సభ్యత్వకార్డుల అందజేస్తున్న గంజి మాధవయ్య

పుత్తూరు అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం సభ్యత్వ కార్డులు వచ్చేశాయి. 2025-26 ఏడాదికి గాను సభ్యత్వంతో పాటు రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ మాధవయ్య పేర్కొన్నారు. సోమవారం పుత్తూరు మండలంలోని పంచాయతీలకు సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బాలాజీ, రూరల్ మండల మాజీ అధ్యక్షుడు కరుణా యాదవ్, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

పుత్తూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో తొలి రోజు టెన్త్ పరీక్షలకు ఐదు సెంటర్లలో వంద శాతం హాజరు కాగా మిగిలిన ఐదింటిలో కేవలం ఆరుగురు గైర్హాజరైనట్టు ఎంఈవో తిరుమలరాజు తెలిపారు. మండలంలో మొత్తం 1434 మంది విద్యార్థులకు 1428 మంది హాజరైనారు. గేట్ పుత్తూరు ఉన్నత పాఠశాల, పుత్తూరు బాలికల ఉన్నత పాఠశాల, ఎస్ఆర్ఎస్ బాలుర ప్రభుత్వ పాఠశాల, గోపాలకృష్ణాపురం రెసిడెన్షియల్ పాఠశాల, పరమేశ్వరమంగళం ఉన్నత పాఠశాలల్లోని కేంద్రాల్లో వంద శాతం హాజరు నమోదైంది.

30న ఉగాది కవి సమ్మేళనం

శ్రీకాళహస్తి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలంలో విశ్వవసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని 30వ తేదీ పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వామివారి ప్రధాన ఆలయం ఎదుట ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

అధ్వానంగా ఆర్ అండ్ బీ రోడ్లు

పైపులైన్ల తవ్వకాలతో ప్రజల ఇక్కట్లు



కడూరు క్రాస్ వద్ద రోడ్డుపై లేచిన దుమ్ము

వరదయ్యపాళెం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లోపంతో రోడ్లు అధ్వానంగా మారాయి. అటు గ్యాస్, ఇటు నీటి పైపులైన్ల కోసం ఇష్టారాజ్యంగా జరుగుతున్న తవ్వకాలతో సత్యవేడు - కడూరు కూడలి, శ్రీకాళహస్తి - తడ ఆర్అండ్‌బీ రోడ్లు దెబ్బతింటున్నాయి. పలు చోట్ల పైపులైన్ల కోసం తవ్వకాలు చేపట్టి మట్టిని కుప్పలుగా వేస్తున్నారు. దీంతో వాహనాలు వెళ్లే సమయాల్లో పెద్దఎత్తున దుమ్ము రేగి స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా దుమ్ము కళ్లల్లో పడి ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక పలుమార్లు ప్రమాదాలు జరిగాయి. ప్రధానంగా సత్యవేడు - కడూరు కూడలి మార్గంలో రాచెర్ల, యానాదివెట్టు, కంచరపాళెం, సుబ్బరాజు కండ్రిగ, వెంకటరెడ్డి కండ్రిగ, కడూరు ప్రాంతాల్లో, శ్రీకాళహస్తి- తడ మార్గంలోని నెలవాయి, వేణుగోపాలపురం, తలారివెట్టు, ఎన్టీఆర్ నగర్, ఇందిరా నగర్, వరదయ్యపాళెం దళితవాడ ప్రాంతాల్లో దుమ్ము రేగుతోంది. గ్యాస్ పైపులైన్ల కోసం ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నట్టు కంచరపాళెం మాజీ సర్పంచు దశరథన్ చెప్పారు. కాంట్రాక్టర్లు కనీస భద్రతా ప్రమాణాలను పాటించడం లేదన్నారు. నెలరోజులకు పైగా కంచరపాళెం వద్ద పైపులైను పనులు చేపడుతున్నారని, మట్టికుప్పలను రోడ్డుకు అడ్డంగా వేయడంతో వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము రేగి ఇబ్బందికరంగా మారిందన్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించి దుమ్ము రేగకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు ప్రారంభం



విద్యార్థులకు సూచనలిస్తున్న వరదయ్యపాళెం ఎస్ఐ

శ్రీకాళహస్తి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మొత్తం 12 కేంద్రాలను పదవ తరగతి పరీక్షల కోసం కేటాయించారు. 2,030 మంది విద్యార్థులు పరీక్షకు రాసేందుకు హాల్ టిక్కెట్లు పొందారు. మొత్తం అన్ని కేంద్రాల్లో కలిపి 11మంది గైర్హాజరయ్యారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఏ కేంద్రంలో 240 మంది విద్యార్థులు గాను 232మంది హాజరయ్యారు. జూనియర్ కళాశాలలోని బీ కేంద్రంలో 192 మందికి గాను 187మంది హాజరయ్యారు. ఎస్ఐ మల్లికార్జున్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): మండలంలో అంజూరు, కేవీబీపురం ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల కేంద్రాల్లో 477మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 10మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నరేష్ బందోబస్తు నిర్వహించారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన టెన్త్ పబ్లిక్ పరీక్షకు 12మంది గైర్హాజరైనట్లు చీఫ్‌లు రూపేష్ కుమార్, గిరిజ తెలిపారు. ఏ, బీ కేంద్రాల్లో 294 మందిహాజరయ్యారు. ఎస్ఐ విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల, బాలికల పాఠ శాల పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాశారు. మొత్తం 372 మంది విద్యా ర్థులకు 369 మంది విద్యార్థులు హాజరైనట్లు డిప్యూటీ ఈవో ప్రభాకర్‌రాజు తెలిపారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరులో జరిగిన పరీక్షలకు 312 గాను 304 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏ సెంటర్‌కు చీఫ్‌గా ఈశ్వర్‌కుమార్, బీ సెంటర్‌కు చీఫ్‌గా విజయకుమారి వ్యవహరించారు. ఎస్ఐ వెంకటేశ్వ రులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. చేశారు. కాగా పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు తమ బైక్‌లను సైలెన్సర్ తీసివేసినట్టు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈక్రమంలో రెండు బైక్‌లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆకతాయి చేష్టలు చేస్తే నెం.9440900727కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ చెప్పారు

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని 9 హైస్కూళ్ళు, రెండు గురుకుల పాఠశాలలు, రెండు ప్రైవేటు పాఠశాలలకు చెందిన 588 మంది విద్యార్థులకు గాను 586 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లుగా మునిసుబ్రమణ్యం, మారయ్య, విమల వ్యవహరించారు. కాగా పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బీరకుప్పం జడ్పీ హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రాల్లో పోలీసులు విద్యార్థులను క్షుణంగా తలనిఖీ చేసి లోపలికి అనుమతించారు. విద్యార్థులకు తాగునీటితో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 7 సెంటర్లలో టెన్త్ పరీక్షలు ప్రారంభం కాగా ఇందులో మొదటి రోజు 1041 మంది పరీక్షలకు హాజరు కాగా 16 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో ఇంద్రాదేవి తెలిపారు.

విద్యుత్ రాయితీపై నేతన్న సంబరాలు



నారాయణవనం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలకు డిమాండ్ పెరుగుతున్నా కార్మికుల కొరత ఈ రంగాన్ని పట్టి పీడిస్తోంది. చేనేత రంగంలో అనుకున్నంత రాబడి లేకపోవడం, గత ప్రభుత్వం విధానాల వలన చాలా మంది చేనేత కార్మికులు మరో వృత్తిని ఎంచుకుని వెళ్లిపోయారు. నారాయణవనం మండలంలో నారాయణవనం, పాలమంగళం, తుంబూరు, అరణ్యంకండ్రిగ, కీళగరం, వెంకటకృష్ణపాళెంలలో సుమారు 12 వందలు కుటుంబాల పైగా చేనేత కార్మికులున్నారు. చేతితో నేచే వస్త్రాలకు మరింత డిమాండ్ ఉంది. చీరలు, ఖద్దరు చొక్కాలు, పంచెలు వంటి వస్త్రధారణలో పెద్దరికం ఉట్టి పడుతుంది. అలాగే సిల్క్, కంచి పట్టుచీరలు నేస్తుంటారు. కార్మికులు తయారు చేసే పడుగులు, పేకలు, పరికరాలను రూ.లక్షల్లో ఖర్చువుతంది. రోజంతా పనిచేస్తేనే కూలీ గిట్టుతుంది. సోమవారం చేనేత కార్మికులకు సీఎం చంద్రబాబు తీపి కబురు చెప్పారు. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు ఇవ్వడానికి కేబినెట్ ఆమోదం తెలపడంతో చేనేత కార్మికులతో ఆనందానికి హద్దులు లేకుండా పోయింది.

మా కష్టాలు గుర్తించారు

మా కష్టాలను గుర్తించినందకు ఆనందంగా ఉంది. ఎన్నో ఏళ్ల కల ఇది. ఆర్థికంగా వెనకబడి ఉన్న మాకు ఉచిత విద్యుత్‌తో ప్రాణం లేచివచ్చినట్లైంది. నాడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నిజం చేసినందకు చంద్రన్న ప్రత్యేక కృతజ్ఞతలు

\- దయాసాగర్, పాలమంగళం

తప్పిన ఆర్థిక ఇబ్బందులు

చాలా సంవత్సరాలుగా చేనేత కార్మికుడిగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నా. నేడు ప్రభుత్వం అసెంబ్లీలో చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ప్రకటించడంతో ఆనందంగా ఉంది. ఆర్థికంగా ఇది మాకు పెద్ద సహకారమే. చంద్రన్నకు రుణపడి ఉంటాం.

\- జయరాం, నారాయణవనం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల అధికారులు రావాలి

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రతి శాఖ అధికారీ తప్పకుండా హాజరు కావాలని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు.తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 11 అర్జీలు రాగా వీటిపై విచారణలు పూర్తి చేసి నివేదికలను ఆయా శాఖలకు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమరావు, ఆర్ఐ నల్లయ్య, మండల సర్వేయరు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌తో డ్వాక్రా సంఘాల నిర్వహణ సులభతరం

సత్యవేడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) ప్రవేశ పెట్టిన లోకోస్ యాప్‌తో డ్వాక్రా సంఘాల నిర్వాహణ సులభతరంగా మారుతుందని వెలుగు ఏపీఎం డాంగే యాదవ్ తెలిపారు.స్థానిక వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలకు లోకోస్ యాప్‌పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక రుణాలపై పారదర్శకత ఉండే విధంగా లోకోస్ యాప్‌ను తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఒక్కో పథకానికి ఒక్కో యాప్‌లో నమోదు చేస్తుండగా ప్రస్తుతం ప్రవేశ పెట్టనున్న లోకోస్ యాప్‌తో డ్వాక్రా సంఘాలు, సభ్యులకు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులోకి రానుందని వివరించారు. కో ఆర్డినేటర్లు పురుషోత్తం, పుల్లయ్య, మంగయ్య, పలువురు సంఘమిత్రలు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం పరిశీలన

నాగలాపురం, మార్చి 17, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందనం గ్రామం ఆరోగ్య ఉప కేంద్రాన్ని సోమవారం డిస్ట్రిక్ ప్రోగ్రాం మేనేజింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్సలు అందించాలన్నారు. అలాగే గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వారికి వివరించారు. తదనంతరం సచివాలయాల వారీగా వైద్య సిబ్బందితో సమీక్షించారు. నాగలాపురం ప్రభుత్వ వైద్యాధికారి విజయకుమార్, ఎస్‌వో నాగేంద్రకుమార్, సూపర్‌వైజర్ నరేష్‌బాబు, డీపీవో ప్రకాష్, సీహెచ్‌వో వేణుగోపాల్, ఎంపీహెచ్ఎస్ మంజులాదేవి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం



బాలాజి - అయ్యప్పన్

సత్యవేడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా పాల గుంటకు చెందిన ఎస్.బాలాజి ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక ఎన్జీవో భవనంలో ఆ పార్టీకి చెందిన బూత్ కమిటీ అధ్యక్షులు, మండల నాయకులు సమక్షంలో అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడిగా బాలాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా బీజేపీ చిత్తూరు జిల్లా కన్వీనర్ రాటకొండ విశ్వనాథ్, అబ్జర్వర్‌గా తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ వ్యవహరించారు. మునికృష్ణయ్య, మోహన్‌బాబు, వెంకటేశులు శెట్టి తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ అధ్యక్షుడిగా నాగలాపురానికి చెందిన ఎల్.అయ్యప్పన్ ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బీజేపీ చిత్తూరు జిల్లా కన్వీనర్ రాటకొండ విశ్వనాథ్, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. లోకనాథం, సత్యనారాయణ రెడ్డి, రాజేంద్రనాయుడు, మునస్వామి నాడార్, మణి నాయుడు, చొక్కలింగం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి ఆత్మహత్య

సత్యవేడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చెట్టుకు ఉరి వేసుకుని కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శ్రీసిటీ పరిధిలోని చిగురుపాళెంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన వలస కార్మికుడు సిమ్మంజి(45) శ్రీసిటీలోని ఒక పరిశ్రమలో కార్మికుడు. స్థానికంగా ఏర్పాటు చేసుకున్న షెడ్డులో ఆదివారం రాత్రి తోటి కార్మికులతో నే ఉన్నాడు. అయితే ఉదయం కనిపించలేదు. అతని కోసం గాలించగా చెరువు కట్టపై వేప చెట్టుకు ఉరివేసుకుని వేలాడుతుండడం గమనించి శ్రీసిటీ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ హరిప్రసాద్ సంఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సిమ్మంజికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు కార్మికులు తెలిపారు.

ఎమ్మెల్యే ఆట విడుపు



టెన్నిస్ ఆడుతున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల అనంతరం విజయవాడలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ ఆటవిడుపుగా క్రీడలతో గడిపారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం సోమవారం విజయవాడ క్రికెట్ స్టేడియానికి చేరుకుని సహచర ఎమ్మెల్యేలతో టెన్నిస్ ఆడి సేద తీరారు.

భక్తకన్నప్ప ఆటోస్టాండ్ ప్రారంభం

శ్రీకాళహస్తి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరందూరు నేషనల్ హైవే బైపాస్‌లో సోమవారం భక్తకన్నప్ప ఆటో స్టాండ్‌ను ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు జె.గురవయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే ప్రారంభమైన తరువాత శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు రాత్రి సమయంలో పట్టణానికి చేర్చేందుకు వీలుగా ఈ స్టాండ్ ఉపయోగపడుతుందన్నారు గోపి, మురళి, చారుశీల, జనార్దన్, బాబు, మునికృష్ణ, తమీం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా పఠాన్ ఫరీద్

శ్రీకాళహస్తి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా పఠాన్ ఫరీద్ నియమితులయ్యారు. సోమవారం ఆయన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. మైనార్టీల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తానని ఫరీద్ తెలిపారు. అంజూరు శ్రీనివాసులు, షేక్ సిరాజ్ బాషా, గోరా, చాంద్ బాషా, ఆరిఫ్, జవా జీ, జమాల్, బాషా, షర్మిలాఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గంగమ్మ ఆలయ కుంభాభిషేకం



పూజల్లో పాల్గొన్న మిద్దెల హరి

శ్రీకాళహస్తి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుందేటివారివీధి ఎస్టీ కాలనీలో కొలువై ఉన్న గంగమ్మ ఆలయ కుంభాభిషేకం సోమవారం శాస్త్రోక్తంగా జరిగింది. గత ఏడాది కొందరు ఎక్స్‌కవేటర్‌తో ఆలయాన్ని కూల్చివేశారు. దీంతో ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్, శ్రీకాళహస్తి పురపాలకసంఘ మాజీ ఫ్లోర్ లీడర్ మిద్దెల హరిని కాలనీవాసులు సంప్రదించారు. స్పందించిన ఆయన రూ.లక్ష విరాళంగా అందజేయించి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయించారు. దీంతో సోమవారం కుంభాభిషేకం జరిగింది. ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. మునిప్రభాకర్, గంగమ్మ, చెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.